క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయం కిటకిట



సమస్యలను విన్నవిస్తున్న మండల ప్రజలు

కూడేరు: కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల మంజూరు, భూసమస్యల పరిష్కారం కోసం మండల ప్రజలు పెద్ద ఎత్తున సోమవారం తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చారు. దీంతో కార్యాలయం కిటకిటలాడిపోయింది. వీఆర్వో, ఆర్ఐ, తహసీల్దార్ గదుల వద్ద ప్రజలు క్యూ కట్టారు. సంతకాలు, ఇతర సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలను తిప్పుకోకుండా అందుబాటులో ఉండి పరిష్కరించాలని తహసీల్దార్ శేషారెడ్డి సిబ్బందికి ఆదేశించారు. అలాగే ఉపాధి పథకం ద్వారా 200 రోజులు పని దినాలను కల్పించాలని సీపీఎం నేతలతో కలసి కూలీలు తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

రేషన్ సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ శేషారెడ్డి

కూడేరు: తూకాల్లో తేడాలు లేకుండా కార్డుదారులందరికీ రేషన్ బియ్యాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని తహసీలార్ శేషారెడ్డి సూచించారు. బియ్యం పంపిణీపై సోమవారం ఆయన తన చాంబర్‌లో సీఎస్‌డీటీ లక్ష్మీదేవితో కలసి డీలర్లతో సమీక్ష నిర్వహించారు. నిర్ణీత సమయంలో కార్డుదారులందరికీ రేషన్ సరుకులు అందాలన్నారు. సరుకులు సక్రమంగా పంపిణీ చేయలేదని ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

రేపు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

రాయదుర్గంటౌన్: రాయదుర్గం పురపాలకసంఘంలోని కౌన్సిల్ హాల్‌లో బుధవారం ఉదయం 10.30 గంటలకు కౌన్సిల్ సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప సోమవారం తెలిపారు. పట్టణంలో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాలతోపాటు ప్రజా సమస్యలపై చర్చిస్తామన్నారు. సమావేశానికి కౌన్సిల్ సభ్యులు, కో ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరు కావాలన్నారు.

తెనగల్లు బాధితులకు పరామర్శ



బాధితులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కళ్యాణదుర్గం/రూరల్: గ్యాస్ సిలిండర్ పేలి గాయాల పాలైన కుందుర్పి మండలం తెనగల్లు గ్రామానికి చెందిన వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రిలో సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, సుధీర్, తిరుమల వెంకటేశులు, నరేంద్రరెడ్డి, షేక్షావలి తదితరులు క్షతగాత్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే క్షతగాత్రులను జిల్లా అడిషనల్ ఎస్పీ విజయ్ భాస్కర్‌రెడ్డి పరామర్శించారు. బాధితులకు న్యాయం చేస్తామన్నారు. వైద్యుల సూచన మేరకు క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు.

నేడు మండల మీట్

కణేకల్లు: స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు హాజరు కావాలన్నారు. సమావేశానికి గైర్హాజరైతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

గ్రామ కార్యదర్శి సేవలు అభినందనీయం



గ్రామ కార్యదర్శిని సన్మానిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: గ్రామ కార్యదర్శి శ్రీధర్‌రావు సేవలు అభినందనీయమని సర్పంచు మోనాలిసా, ఉపసర్పంచు మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఈనెల 26న జిల్లా కేంద్రంలో జరిగిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ చేతులమీదుగా వజ్రకరూరు కార్యదర్శి ఉత్తమ అవార్డును అందుకున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం వజ్రకరూరులోని గ్రామ సచివాలయంలో ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ డైరెక్టర్ మహమ్మద్, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి నల్లబోతుల రాజు, మైనార్టీ విభాగం అధ్యక్షుడు పట్ట ఖా జాఫీరా సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అంతిమ నిర్ణయం అతివదే!

- మహిళా ఓటర్లే అధికం
- ఎన్నికల్లో కీలకం కానున్న వైనం



రాయదుర్గం: వచ్చే ఎన్నికల్లో మహిళా ఓటర్లే కీలకం కానున్నారు. గత ఎన్నికల కంటే ఈ సారి వీరి సంఖ్య గణనీయంగా పెరిగింది. వారు ఏ పార్టీ వైపు మొగ్గుచూపుతారో ఆ పార్టీకే విజయావకాశాలు ఎక్కువగా ఉంటాయని విశ్లేషకులు భావిస్తున్నారు. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో 916 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలోని తాజాగా విడుదలైన ముసాయిదా ప్రకారం 7,11,020 మంది ఓటర్లు నమోదయ్యారు. ఇందులో 3,51,190 మంది పురుషులు, 3,58,760 మంది మహిళలు ఉన్నారు. ఇతరులు 70 మంది నమోదు చేశారు. 2019 ఎన్నికల్లో కంటే 30 శాతానికి పైగా ఓటర్లు పెరిగారు. తాజా ఓటర్ల జాబితా ప్రకారం మూడు నియోజకవర్గాల్లోనూ 7570 మంది మహిళా ఓటర్లే అధికంగా నమోదయ్యారు. మహిళల సంక్షేమానికి అన్ని రంగాల్లోనూ పెద్దపీట వేసిన పార్టీకే మద్దతుగా నిలుస్తారనే ప్రచారం అప్పుడే ఊపందుకుంది. కాగా రాయదుర్గం నియోజకవర్గంలో పురుషుల కంటే 3646 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో పురుషులు కంటే 1041 మంది స్త్రీలు, ఉరవకొండ నియోజకవర్గంలో పురుషులు కంటే 2883 మంది మహిళలు ఎక్కువగా ఉన్నారు.

ఓటర్ల వివరాలిలా..

నియోజకవర్గం	మొత్తం	పురుషులు	మహిళలు	ఇతరులు
రాయదుర్గం	2,60,859	1,28,090	1,31,736	33
కళ్యాణదుర్గం	2,27,438	1,13,195	1,14,236	07
ఉరవకొండ	2,22,723	1,09,905	1,12,788	30

అర్హులందరికీ ఓటు హక్కు



అర్హత కలిగిన వారందరికీ ఓటు హక్కు కల్పించేలా కృషి చేశాం. ఇటీవల తాజా ఓటరు ముసాయిదాను విడుదల చేశాం. దాని ప్రకారం పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువగా ఉన్నారు. ఓటరు నమోదు నుంచి చేర్పులు, మార్పులు, తొలగింపులోనూ పారదర్శకతకే పెద్దపీట వేస్తున్నాం.

– రాణి సుస్మిత, ఆర్డీఓ, కళ్యాణదుర్గం

తిరుపతి సభకు 'విశ్వ' హాజరు



మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో మాట్లాడుతున్న విశ్వేశ్వరరెడ్డి

విడపనకల్లు: అనంతపురంలో త్వరలో జరిగే సిద్ధం సభను విజయవంతం చేసే దిశగా తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశానికి రాయలసీమ ముఖ్య నేతలతో పాటు ఉరవకొండ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హాజరయ్యారు. విశ్వేశ్వరరెడ్డితో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చర్చించారు. సిద్ధం సభను విజయవంతం చేసే విధంగా జనసమీకరణ సంబంధించిన అంశాలను సమీక్షించారు.

ప్రతిభను వెలికితీసేందుకే 'ఆడుదాం ఆంధ్రా'



రాయదుర్గం: క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, గౌని ఉపేంద్రరెడ్డి



కళ్యాణదుర్గం రూరల్: క్రికెట్ మహిళా విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన కళ్యాణదుర్గం జట్టు

రాయదుర్గం: గ్రామీణ క్రీడాకారుల్లో దాగిన ప్రతిభను వెలికితీసేందుకే ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రారెడ్డి అన్నారు. పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో వారం రోజులుగా సాగిన నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ ప్రత్యేకాధికారి, జిల్లా పరిశ్రమల శాఖ జేఎం నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పొరాళ్ల శివ ఆధ్వర్యంలో విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడారు. నియోజకవర్గస్థాయి క్రీడా పోటీల్లో 60 జట్లు పాల్గొంటే 25 జట్లు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాట్మింటన్ పోటీల్లో సత్తాచాటి విజేతగా నిలిచాయన్నారు. కార్యక్రమంలో పట్టణంలోని పలు వార్డుల కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జులు, పార్టీ నాయకులు, వివిధ శాఖల అధికారులు, పీడీ, పీఈటీలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

విజేతల వివరాలు

క్రికెట్: పురుషుల టీమ్‌లో మొదటి బహుమతి రాయదుర్గం (డ్రైవర్స్ కాలనీ), రెండో బహుమతి కణేకల్లు, మహిళా విభాగం మొదటి బహుమతి కణేకల్లు, రెండో బహుమతి డి హీరేహాళ్ మండలం మల్లికేతి

బ్యాట్మింటన్: పురుషుల విభాగం మొదటి బహుమతి రాయదుర్గం (కణేకల్లు రోడ్డు), రెండో బహుమతి బొమ్మనహాళ్ మండలం గోనేహాళ్, మహిళా విభాగం మొదటి బహుమతి రాయదుర్గం (బళ్లారిరోడ్డు). రెండో బహుమతి డి హీరేహాళ్ మండలం మడేనహళ్లి

వాలీబాల్: పురుషుల విభాగం మొదటి బహుమతి రాయదుర్గం (కణేకల్లు రోడ్డు), రెండో బహుమతి బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్, మహిళా విభాగం మొదటి బహుమతి డి హీరేహాళ్ మండలం నాగలాపురం

కబడ్డీ: పురుషుల విభాగం మొదటి బహుమతి రాయదుర్గం (కోటవీధి), రెండో బహుమతి బొమ్మనహాళ్ మండలం ఉద్దేహాళ్, మహిళా విభాగం మొదటి బహుమతి రాయదుర్గం మండలం (వజ్రవసూర్), రెండో బహుమతి బొమ్మనహాళ్

ఖోఖో: పురుషుల విభాగం మొదటి బహుమతి గుమ్మఘట్ట మండలం గొల్లపల్లి, రెండో బహుమతి రాయదుర్గం మండలం జుంజురంపల్లి, మహిళా విభాగం మొదటి బహుమతి డి హీరేహాళ్ మండలం నాగలాపురం జట్లు దక్కించుకున్నాయి.

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం నియోజకవర్గం వ్యాప్తంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు సోమవారం ముగిశాయి. నియోజకవర్గ స్థాయిలో మొదటి స్థానంలో ఉన్న జట్లు జిల్లా స్థాయి క్రీడాపోటీల్లో 31వ తేదీ జరుబోయే క్రీడల్లో పాల్గొంటాయి. కార్యక్రమంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ చల్లా కిరణ్, పీఈటీలు, మురళి, శ్రీనాథ్, కిరణ్, రమేష్, రాజగోపాల్, శివ కేషవ్, వణీ, సురేష్, ఇబ్రహీం, శివ, ఆనంద్, లలిత, రమేష్, లత, మహేష్, నాగరాజు, క్రీడాకారులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు:

బ్యాట్మింటన్: మొదటి బహుమతి కళ్యాణదుర్గం జట్టు, రెండోబహుమతి కుందుర్పి

ఖోఖో: పురుషుల విభాగంలో మొదటి స్థానం కుందుర్పి, రెండో స్థానం కంబదూరు, మహిళా విభాగంలో మొదటి స్థానం కళ్యాణదుర్గం జట్టు, రెండవ స్థానం కంబదూరు జట్టు

వాలీబాల్: పురుషుల విభాగంలో మొదటి స్థానం కళ్యాణదుర్గం, రెండో స్థానంలో కుందుర్పి

క్రికెట్: పురుషుల విభాగంలో మొదటి స్థానం శెట్టూరు, రెండవ స్థానం కుందుర్పి, మహి విభాగంలో మొదటి స్థానం కళ్యాణదుర్గం జట్టు, రెండో స్థానం కుందుర్పి జట్టు

కబడ్డీ: పురుషుల విభాగంలో మొదటి స్థానం శెట్టూరు, రెండో స్థానం కళ్యాణదుర్గం జట్టు, మహిళా విభాగంలో మొదటి స్థానం కుందుర్పి, రెండవ స్థానంలో బ్రహ్మసముద్రం జట్టు నిలిచాయి.

అందరూ 'సిద్ధం' కండి



కళ్యాణదుర్గం: మాట్లాడుతున్న పార్టీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి



శెట్టూరు: మాట్లాడుతున్న మండల మాజీ కన్వీనర్ సోమనాథ్‌రెడ్డి

కళ్యాణదుర్గం/శెట్టూరు/బ్రహ్మసముద్రం/కంబదూరు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న సిద్ధం కార్యక్రమానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి పిలుపునిచ్చారు. సోమవారం కళ్యాణదుర్గం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కళ్యాణదుర్గం మున్సిపాలిటీ, రూరల్ మండలాల పరిధిలో సిద్ధం సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో ఈనెల 11న నిర్వహించే సీఎం జగన్ బహిరంగ సభను అందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజ్‌కుమార్, వైస్ చైర్మెన్ జయం ఫణి, పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, జెడ్పీటీసీ బొమ్మన్న, జేసీఎస్ కన్వీనర్లు అర్చన, ఆంజనేయులు, సీనియర్ నాయకులు సుధీర్, తిరుమల వెంకటేశులు, దొణస్వామి, వెంకటేశులు, గోళ్ల సూరి, గోపాల్, కేశవ్ గౌడ్, చంద్రానాయక్, బలరాం, లింగమ్మ, సతీష్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

- శెట్టూరు మండల కేంద్రంలోని మండల మాజీ కన్వీనర్ సోమనాథ్‌రెడ్డి వ్యవసాయ తోటలో సోమవారం 'సిద్ధం' సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మంజునాథ్, కన్వీనర్ శివన్న యాదవ్, జేసీఎస్ కన్వీనర్ తిమ్మరాజు, నాయకులు పోస్టు రామకృష్ణ, హరినాథ్ రెడ్డి, ఎంఎస్ రాయుడు, తిప్పేస్వామి, అన్ని గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.
- బ్రహ్మసముద్రం మండల కేంద్రంలోని సర్పంచ్ వ్యవసాయ తోటలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు , కార్యకర్తలతో 'సిద్ధం' సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రశేకర్‌రెడ్డి, మండల కన్వీనర్ బసవరాజు, సర్పంచ్ శెట్టిగారి మంజునాథ, ఎంపీటీసీలు బూసప్ప, నరసింహ , సీనియర్ నాయకులు గంగాధరప్ప, అంజినేయులు, రైతు సంఘం మండల అధ్యక్షుడు గోపాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ లోకేష్, పాలబండ్ల చంద్రశేకర రెడ్డి, జిన్నామల్లి, దేవపుత్ర , నజీర్ పాల్గొన్నారు.
- కంబదూరు మండల కేంద్రంలోని మల్లీశ్వరస్వామి ఆలయంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకులు సమావేశమై సిద్ధం కార్యక్రమంపై చర్చించారు. కార్యక్రమంలో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ డైరెక్టర్ బాబు రెడ్డి, జెడ్పీటీసీ గుద్దెళ్ల నాగరాజు, వాల్మీకి సేవా సమితి తాలూకా అధ్యక్షుడు గోవింద్, మండల కన్వీనర్ బాలరాజు, సచివాలయ మండల కన్వీనర్ సాకే గంగాధర్, జిల్లా కమిటీ సభ్యుడు నీలి శంకరప్ప పాల్గొన్నారు.



బ్రహ్మసముద్రం: మాట్లాడుతున్న ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



ట్యాబులు అందజేస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్

కూడేరు: భవిత కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న దృష్టి, వినికిడి లోపమున్న పిల్లలకు సమగ్ర శిక్ష ద్వారా ప్రత్యేకంగా రూపొందించిన ట్యాబులు సరఫరా అయ్యాయి. సోమవారం మండల కేంద్రంలో ఎంఈఓ చంద్రశేఖర్ పిల్లలకు వాటిని అందజేశారు. ట్యాబుల ద్వారా పాఠ్యాంశాలు సులభతరంగా అర్థమవుతాయని , వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్టీలు మస్తానయ్య, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐ బాధ్యతల స్వీకరణ



ఎస్ఐ శ్రీనివాసులు

బొమ్మనహాళ్: ఎస్ఐగా వి.శ్రీనివాసులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కర్నూలు జిల్లా హోలిగుంద మండలం నుంచి బొమ్మనహాళ్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకుంటామన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటివారైనా సహించేది లేదన్నారు. ఈ సందర్భంగా ఆయకు పలువురు రాజకీయ నాయకులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ ఆంజనేయులు కంబదూరుకు బదిలీ అయ్యారు.

ఇన్‌పుట్ సబ్సిడీ మంజూరు చేయాలి

విడపనకల్లు: ఖరీఫ్, రబీలో పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని తహసీల్దారుకు సీపీఎం నాయకులు వినతిపత్రం అందజేశారు. విడపనకల్లులో తహశీల్దార్ ఈరమ్మను సోమవారం సీపీఎం జిల్లా నాయకులు రంగారెడ్డి, సీఐటీయూ నాయకులు కలసి రైతుల సమస్యలు వివరించారు.

సర్పంచుకు గాయాలు

విడపనకల్లు(ఉరవకొండ): ఉరవకొండ మండలంలోని నెరిమెట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచు యోగేంద్రరెడ్డి రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. సోమవారం ఆయన ఉరవకొండకు ద్విచక్రవాహనంలో వెళ్తుండగా మార్గమధ్యలో బైకు అదుపుతప్పి కిందపడ్డాడు. ఘటనలో ఆయన కాళ్లు, చేతులకు గాయాలయ్యాయి. స్థానికులు అతడిని 108లో ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

'భూ సమస్య పరిష్కరించండి'

కళ్యాణదుర్గం రూరల్: దళితుల భూసమస్యలను పరిష్కరించాలని సోమవారం ఆర్డీఓ రాణిసుస్మితకు జేఏసీ నాయకుడు చెలమప్ప వినతిపత్రం అందజేశారు. అంతకుముందు దళిత నాయకులు, రైతులతో కలసి ఆర్డీఓ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు.

సీఎం జగన్‌తోనే ప్రజా సంక్షేమం



నేమకల్లు గ్రామంలో ఇంటింటా ప్రచారం చేస్తున్న మెట్టు విశ్వనాథ్‌రెడ్డి

బొమ్మనహాళ్: అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందించి ప్రజల ఆర్థికాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ ఆయనను సీఎంగా చేసుకుంటే ప్రభుత్వ సంక్షేమ పథకాలు కొనసాగుతాయని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మెట్టు విశ్వనాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని నేమకల్లు, ఉంతకల్లు గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న పథకాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి, వేయించి వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. ఆయన మాట్లాడుతూ మంచి చేసిన ప్రభుత్వాని మరోసారి ఎన్నుకోవాలన్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ఉపాధ్యాక్షుడు రాళ్ల తిమ్మారెడ్డి, వైస్ ఎంపీపీ రమేష్, సర్పంచ్‌లు పరమేశ్వర, ముక్కన్న, ఎంపీటీసీలు చిక్కణ్ణ, రమేష్, నాయకులు ఈశ్వరరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎంసీహెచ్ రాజ్‌కుమార్, పయ్యావుల సత్యన్న, జి.ఎం.నాయుడు, శాంతయ్య, మెట్టు హనుమంతరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రామాంజనేయరెడ్డి, సూర్యప్రతాప్ రెడ్డి, దాన్‌రెడ్డి, డాక్టర్ బసప్ప, కాశీం, వీరన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గొటుకూరులో ఫైలేరియా నిర్ధారణ పరీక్షలు



రక్త నమూనాలు సేకరిస్తున్న జిల్లా వైద్యాధికారులు

కూడేరు: మండలంలోని గొటుకూరులో జిల్లా వైద్యాధికారులు సోమవారం రాత్రి బోధకాలు (ఫైలేరియా) వ్యాధి నిరోధక (నైట్ బ్లడ్ సర్వే) సర్వే నిర్వహించారు. ఆరు బృందాలుగా వైద్య సిబ్బంది ఏర్పడి గ్రామంలో ఫైలేరియా వ్యాధి నిర్ధారణ కోసం ప్రజల నుంచి రక్త నమూనాలను సేకరించారు. సర్వేను మలేరియా సబ్ యూనిట్ అధికారి మద్దయ్య పర్యవేక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆశాలత, సూపర్‌వైజర్లు నూరు బాషా, రవీంద్ర, శ్రీధర్, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు మురళి, శివప్రసాద్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం



బోరు వేస్తున్న దృశ్యం

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని ఈస్ట్ కోడిపల్లి పంచాయతీలోని తిమ్మగానిపల్లిలో తాగునీటి సమస్యకు ఎంపీ, కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య పరిష్కారం చూపారు. గ్రామస్తుల వినతి మేరకు ఆదివారం ఎంపీ తిమ్మగానిపల్లిలో బోరు వేయించారు. నీరు పుష్కలంగా పడటంతో గ్రామస్తులు ఎంపీ రంగయ్య, ఎంపీపీ మారుతమ్మకు కృతజ్ఞలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌కు అండగా ఉంటామని గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ ఆంజనేయులు, నాయకులు పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా నర్సారెడ్డి



కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం మున్సిపల్ కమిషనర్‌గా బీవీ నర్సారెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానన్నారు. ఈ సందర్భంగా ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

తెగుళ్ల బారిన వేరుశనగ



జల్లిపల్లి వద్ద తెగుళ్ల బారిన పడ్డ వేరుశనగ పంట

కూడేరు: రబీలో బోర్ల కింద సాగు చేసిన వేరుశనగ పంటకు తెగుళ్లు సోకడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొర్రకోడు, జల్లిపల్లి, కరుట్లపల్లి, ఉదిరిపికొండ, మరుట్ల, అంతరగంగ, కూడేరు, కమ్మూరు, చోళసముద్రం, జయపురం తదితర గ్రామాల్లో రైతులు సుమారు 5 వేల ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశారు. గుజరాత్ ట్యాగ్‌తో పాటు మరికొన్ని వెరైటీ రకం విత్తనాలు విత్తారు. సాగుచేసి సుమారు 40 రోజులు దాటడంతో పంటకు మొవ్వ కుళ్లు, లద్దెపురుగు, పచ్చ పురుగు ఆశించాయి. మందులు పిచికారీ చేసినా తగ్గుముఖం పట్టడం లేదని రైతులు వాపోతున్నారు. వ్యవసాయాధికారులు పర్యటించి తెగుళ్ల నివారణకు సూచనలివ్వాలని రైతులు కోరుతున్నారు.

నేడు ప్రజావేదిక

విడపనకల్లు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 2022 జనవరి నుంచి 2023 డిసెంబర్ వరకూ ఉపాధి పథకంలో జరిగిన అభివృద్ధి పనులపై ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు ఏపీఓ సంజీవ్‌కుమార్ సోమవారం తెలిపారు. కార్యక్రమానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, ఉపాధి మేట్లు, కూలీలు, రైతులు హాజరు కావాలన్నారు.

నేడు 'జగనన్న ఆరోగ్య సురక్ష'

కూడేరు: మండలంలోని జల్లిపల్లిలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగభూషణ రెడ్డి సోమవారం తెలిపారు. జల్లిపల్లి, ఉదిరిపికొండ, శివరాంపేట, ఉదిరిపికొండ తండా గ్రామస్తులు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కణేకల్లు: మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామంలో మంగళవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గరుడచేడు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రమనోహర్ సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ వైద్యశిబిరం నిర్వహిస్తామని, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో సోమవారం ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. బ్రహ్మసముద్రం మండలానికి చెందిన హరిజన లింగప్ప పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో కుటుంబంతో కలసి కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కొడుకు పవన్ కళ్యాణ్ జీవితంలో స్థిరపడకపోవడంతో మనస్థాపం చెందిన ఆయన ఇంట్లో ఎవరూ లేని సమయంలో విష గుళికలు మింగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఓటుహక్కుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న డిగ్రీ కళాశాల సిబ్బంది

విడపనకల్లు(ఉరవకొండ): ఉరవకొండ మండలంలోని లత్తవరం, లత్తవరం తండా గ్రామాల్లో సోమవారం మహాత్మ డిగ్రీ కళాశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఓటుహక్కు వినియోగంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటు వజ్రాయుధంతో సమానమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బసవరాజు, ప్రసాదు, అధ్యాపకులు శ్రీనివాసులు, సత్యనారాయణ, సంపత్, హనుమన్న, సత్యనారాయణ, ప్రజలు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ కార్యవర్గంలో చోటు



భాస్కర్, హనుమప్పను సత్కరిస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

విడపనకల్లు: ఏపీటీఎఫ్ నూతన కార్యవర్గంలో ఉరవకొండకు చెందిన ఇద్దరికి చోటుదక్కింది. సోమవారం జిల్లా కేంద్రంలో ఏపీటీఎఫ్ సమావేశం నిర్వ హించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నిక చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉరవకొండకు చెందిన సాకే భాస్కర్, రాష్ట్ర కౌన్సిలర్‌గా హనుమప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారిని ఏపీటీఎఫ్ నాయకులు సత్కరించారు.